# దంత వైద్యులేరీ..?

## జిల్లా మెడికల్ కళాశాలల్లో దంత వైద్యుల కొరత
## ఖాళీల భర్తీపై కాంగ్రెస్ సర్కార్ కాలయాపన



సిటీబ్యూరో, ఏప్రిల్11, (నమస్తే తెలంగాణ): ఆరోగ్య తెలంగాణగా పదేళ్లు వర్ధిల్లిన రాష్ట్రం నేడు అనారోగ్యానికి గురవుతోంది. వైద్యుల కొరత వల్ల ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన వైద్యం సామాన్యులకు దూరమవుతోంది. బీఆర్ఎస్ పాలనలో ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా జిల్లాకో వైద్య కళాశాల నిర్మిస్తే వాటిని ప్రస్తుత కాంగ్రెస్ పాలకులు విస్మరించారు. రాజధాని నగరంలో మినహా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మెడికల్ కళాశాలల్లో దంత వైద్యులు లేక మెడికల్ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు, మరోవైపు దంత సమస్యలతో బాధపడేవారంతా జిల్లా ప్రభుత్వాసుపత్రుల్లో దంత వైద్యులు లేకపోవడంతో చేతినుంచి డబ్బులు ఖర్చుపెట్టి ప్రైవేట్ ఆసుపత్రుల మెట్లెక్కుతున్నారు. ఇదిలా ఉండగా ప్రభుత్వం ఖాళీలను భర్తీ చేయకుండా కాలయాపన చేస్తుండటం గమనార్హం. మరోవైపు ఈ సమస్యను పరిష్కరించాలని ఆల్ఇండియా డెంటల్ స్టూడెంట్ అండ్ సర్జన్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం డీఎంఈ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.

### ఎన్ఎంసీ నియమాలు గుర్తులేవా..?

గత బీఆర్ఎస్ సర్కారు రాష్ట్రంలోని నూతన జిల్లాలన్నింటిలో మెడికల్ కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టి మెరుగైన వైద్యసేవలందించేందుకు ప్రణాళికలు చేసింది. ఇందులో భాగంగానే మారుమూల జిల్లాలకు సైతం మెడికల్ కళాశాల మంజూరు చేసి, నిర్మించింది. కార్పొరేట్ స్థాయిలో సర్కార్ వైద్యం అందించాలనే లక్ష్యాన్ని కేసీఆర్ సర్కార్ నిజం చేసింది. కానీ ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ సర్కార్ వైద్యరంగాన్ని పాతరేసింది. రాష్ట్రవ్యాప్తంగా 38 ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ఉండగా రాష్ట్ర రాజధానిలోని ప్రముఖ మెడికల్ కళాశాలల్లో మినహాయించి ఏ ఒక్క కళాశాలలో కూడా దంత వైద్యులు లేకపోవడం గమనార్హం. వాస్తవానికి ఎన్ఎంసీ గైడ్‌లైన్స్ ప్రకారం వందమంది విద్యార్థులు ఉన్న కళాశాలలో తప్పనిసరిగా ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, జూనియర్ రెసిడెంట్ ఒక్కొక్కరు చొప్పున డెంటల్ టెక్నీషియన్లు నలుగురు ఉండాలి. సీట్లు పెరుగుతున్న తరుణంలో సిబ్బంది కూడా పెరగాల్సి ఉంటుంది. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 200కు పైగా దంత విభాగంలో ఖాళీలు ఉన్నట్లు సమాచారం. వాటిని భర్తీ చేస్తేనే సర్కారు వైద్యం సామాన్యులకు అందించినవాళ్ళమవుతాం. ఇప్పటికే దంత సమస్యల పరిష్కారానికి పలు ప్రైవేట్ ఆసుపత్రులు రూ.వేలల్లో వసూలు చేస్తూ, సామాన్యులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు.

### ఖాళీలను భర్తీ చేయాలి

రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న దంత వైద్యుల పోస్టులు భర్తీ చేయాలి. జిల్లా ఆసుపత్రుల్లో దంత వైద్యుల కొరత వల్ల ప్రజలు హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. డీఎంఈ కార్యాలయంలో ఈ సమస్యపై వినతి పత్రం అందించాం. పరిష్కారం త్వరగా చూపాలని కోరాం.

– డాక్టర్ ఎండీ మన్‌జూర్ అహ్మద్, డెంటల్ స్టూడెంట్ అండ్ సర్జన్స్ అసోషియేషన్ జాతీయ అధ్యక్షుడు



### మిస్ తెలుగు ఫైనలిస్ట్‌గా కాప్రా అమ్మాయి

ఇన్‌స్టాలో ఓటు వేసి గెలిపించండి: తండ్రి

కాప్రా, ఏప్రిల్ 11: కాప్రాలోని ఏఎస్ రావు నగర్ డివిజన్ భవానీ నగర్‌కు చెందిన చూర్ణిక కొత్తపల్లి.. మిస్ తెలుగు యూఎస్ఏ–2025 ఫైనలిస్ట్‌గా ఎంపికయ్యారు. ప్రస్తుతం అమెరికాలోని ఫ్లోరిడాలో ఉన్న చూర్ణిక ఈ పోటీలో పీపుల్స్ ఛాయిస్ అవార్డు కోసం పోటీ పడుతున్నారు. పోటీలో విజేతగా నిలవడం కోసం ప్రజల మద్దతు అవసరమని ఆమె తండ్రి కొత్తపల్లి రాంబాబు (లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ 320 హెచ్–పి ఆర్ ఓ) తెలిపారు. ఇందుకోసం ఇన్‌స్టాగ్రామ్‌లో @missteluguusaorg ను ఫాలో అయి ఆమెకు మద్దతుగా ఓటు వేసి గెలిపించాలని, ఫైనల్ రౌండ్ మే 25న ఉంటుందని రాంబాబు అన్నారు.

### రూ. కోటి ఆస్తిపన్ను చెల్లించిన టెక్ మహేంద్ర వర్సిటీ




దుండిగల్, ఏప్రిల్ 11: దుండిగల్ మున్సిపాలిటీ, బహదూర్ పల్లి పరిధిలోని టెక్ మహీంద్రా యూనివర్సిటీ ప్రభుత్వం కల్పించిన 5 శాతం ఆస్తిపన్ను చెల్లింపు రాయితీని సద్వినియోగం చేసుకుంది. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ఎన్ వెంకటేశ్వర్ నాయక్‌కు.. ఆ యూనివర్సిటీ వారుఎర్లీ బర్డ్ పథకంలో భాగంగా 5 రిబేట్ పథకం పన్నును మినహాయించుకుని రూ.1కోటి4 లక్షల,62 వేల,603 ఆస్తి పన్ను చెల్లించారు. ఈ అవకాశం ఏప్రిల్ 30వ తేదీ వరకు ఉంటుందన్నారు. గృహ యాజమానులు సైతం ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని తెలిపారు.

### వీధి వ్యాపారుల భద్రతపై చర్చ

సిటీబ్యూరో, ఏప్రిల్ 11 (నమస్తే తెలంగాణ): వీధి వ్యాపారుల భద్రత, జీవనోపాధి, చట్టపరమైన గుర్తింపునకు కృషి చేస్తున్నట్లు మేయర్ గద్వాల్ విజయలక్ష్మితెలిపారు. శుక్రవారం జాతీయ హాకర్స్ ఫెడరేషన్(ఎన్‌హెచ్ఎఫ్) ప్రతినిధులతో మేయర్ కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వీధి వ్యాపారులతో సంబంధిత అనేక ముఖ్య అంశాలపై చర్చించారు. దేశ వ్యాప్తంగా 28 రాష్ట్రాలలో 1500కి పైగా అనుబంధ సంఘాలు, 20 లక్షల మందికిపైగా వీధి వ్యాపారులను ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు ఎన్‌హెచ్ఎఫ్ ప్రధాన కార్యదర్శి శక్తిమాన్ ఘోష్ చెప్పారు. అలాగే జీహెచ్ఎంసీ పరిధిలోని వీధి వ్యాపారుల సమస్యలను వివరించారు.

## అసెంబ్లీలో పూలే విగ్రహం ఏర్పాటు చేయాలి

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



సీపీఎం కార్యదర్శి జాన్ వెస్లీతో ఎమ్మెల్సీ కవిత, నాయకులు

చిక్కడపల్లి, ఏప్రిల్ 11: అసెంబ్లీ ఆవరణలో మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం ఏర్పాటు చేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఆర్టీసీ క్రాస్ రోడ్స్ లోని సీపీఎం కార్యాలయంలో ఆ పార్టీ కార్యదర్శి జాన్ వెస్లీని కలిసి మద్దతు కోరారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ..అసెంబ్లీలో జ్యోతిరావు పూలే విగ్రహం ఏర్పాటు చేయాలని జిల్లాల వారీగా కార్యక్రమాలు చేపట్టి ప్రజల మద్దతును కూడగడుతున్నామని చెప్పారు. అందులో భాగంగానే ఇప్పటివరకు 27 సమావేశాలు చేపట్టడం జరిగిందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కవిత కోరారు.


### సీపీఎం సంపూర్ణ మద్దతు ..

ఈ సందర్భంగా జాన్ వెస్లీ మాట్లాడుతూ.. అసెంబ్లీలో పూలే విగ్రహ ఏర్పాటుకు సీపీఎం సంపూర్ణ మద్దతు ఇస్తుందని అన్నారు. కులగణన వివరాలు రాష్ట్రప్రభుత్వం వెల్లడించాలని డిమాండ్ చేశారు. కేంద్రం కులగణనకు వ్యతిరేకకంగా వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. జాగృతి నుంచి ఎలాంటి కార్యక్రమాలు తీసుకున్నా తమ మద్దతు ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, ముఠా జయసింహ, బీఆర్ఎస్ నాయకులు.. గట్టు రామచందర్, పి నారాయణ, రూప్ సింగ్, దత్తాత్రేయ, తెలంగాణ జాగృతి నాయకులు , సీపీఎం నాయకులు..జ్యోతి, రవీందర్ పాల్గొన్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

సిటీబ్యూరో, ఏప్రిల్11,(నమస్తే తెలంగాణ): జాతీయ కవి నాగభైరవ కోటేశ్వరరావు పేరుతో ఒంగోలులో నెలకొల్పిన నాగభైరవ సాహిత్య పీఠం–2025 సాహితీ పురస్కారాలకు ఆహ్వానం పలుకుతోంది. ఈ సందర్భంగా సాహిత్య పీఠం అధ్యక్షులు నాగభైరవ ఆదినారాయణ ఓ ప్రకటన విడుదల చేశారు. తెలుగు రాష్ట్రాలతో పాటు రాష్ట్రేతరులు, విదేశాల్లో స్థిరపడ్డవారు సైతం 2021 – 2024 సంవత్సరాల మధ్య ప్రచురించిన ముద్రిత అనువాద గ్రంథాలను రచించినవారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. మొదటి బహుమతి రూ.10వేలు, ద్వితీయ బహుమతిగా రూ.5వేలు అందజేస్తారని వివరించారు. రచనలను మే10 లోపు డా.నాగభైరవ ఆదినారాయణ, 202–శ్రీవెంకటసాయిరెసిడెన్సీ, రామయ్యనగర్,ఒంగోలు523002, ప్రకాశం జిల్లా చిరునామాతో పంపించాలని, వివరాలకు 98497 99711 లో సంప్రదించాలని తెలిపారు.

## ఆకట్టుకున్న గాంధీ గ్రాడ్యుయేషన్ డే




బన్సీలాల్ పేట, ఏప్రిల్ 11 : గాంధీ మెడికల్ కాలేజ్ 2019 బ్యాచ్ గ్రాడ్యుయేషన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కాలోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ పీవీ నందకుమార్ రెడ్డి హాజరయ్యారు. పలు విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గోల్డ్ మెడల్స్‌ను, ఎంబీబీఎస్ పూర్తిచేసిన 2019 బ్యాచ్ వైద్య విద్యార్థులందరికీ డాక్టర్ పట్టాలను అందజేసి, అభినందనలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఎంతో పవిత్రమైన వైద్యవృత్తిని నైతిక విలువలతో నిర్వహించాలని అన్నారు. 1973 బ్యాచ్‌లో గాంధీ మెడికల్ కాలేజీలో తాను చదువుకున్నానని, ఈరోజు వైస్ ఛాన్స్ లర్ హోదాలో ముఖ్యఅతిథిగా పాల్గొనడం ఆనందంగా ఉన్నదని అన్నారు. డీఎంఈ డాక్టర్ ఎ.నరేంద్ర కుమార్ మాట్లాడుతూ.. ఎంతో ప్రతిష్టాత్మకమైన గాంధీ మెడికల్ కళాశాల ఖ్యాతిని నూతన డాక్టర్లు మరింత పెంచే విధంగా నడుచుకోవాలని కోరారు.

### కేసీఆర్‌తోనే వైద్యరంగ అభివృద్ధి..

ఆదిలాబాద్ జిల్లా బోథ్ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్ వైద్యరంగ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని అన్నారు. 33 జిల్లాలలో 33 వైద్య కళాశాలలు ఏర్పాటు చేసిన కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. కరోనా సమయంలో గాంధీ ఆసుపత్రిలో లక్షలాదిమందికి వైద్యం అందించి పునర్జన్మ ప్రసాదించారని అన్నారు. గాంధీ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ ఇందిరా, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.వాల్యా, వివిధ విభాగాల హెచ్ఓడీలు డాక్టర్ రాజారామ్, డాక్టర్ సునీల్ కుమార్, డాక్టర్ మురళీధర్, గాంధీ అలుమ్ని అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ లింగమూర్తి, ఎంపీహెచ్ఓ వేణుగోపాల్ గౌడ్ పాల్గొన్నారు.

## మూసీ పనులను వేగవంతం చేయండి

అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష



సిటీ బ్యూరో, ఏప్రిల్ 11(నమస్తే తెలంగాణ): మూసీ పునరుజ్జీవన. ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బాపూఘాట్ వద్ద నిర్మించ తలపెట్టిన గాంధీ సరోవర్‌తో పాటు మీర్ఆలం ట్యాంక్ పై నిర్మించనున్న బ్రిడ్జి నమూనాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. హైదరాబాద్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో శుకవారం మూసీ పునరుజ్జీవనంపై అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. .

### సింగపూర్ గార్డెన్స్‌ను తలపించేలా..

సింగపూర్‌లోని గార్డెన్స్ బై ది బేను తలపించేలా బర్డ్స్ ప్యారడైజ్, వాటర్ ఫాల్స్ లాంటివి ఉండేలా ఈ మూడు ఐలాండ్‌లను అభివృద్ధి చేయాలని చెప్పారు. వెడ్డింగ్ డెస్టినేషన్‌కు వీలుగా ఉండే కన్వెన్షన్ సెంటర్లతో పాటు అడ్వెంచర్ పార్క్, థీమ్ పార్క్, అంఫీథియేటర్‌ను ఏర్పాటు చేసేందుకు వీలుగా డిజైన్లు ఉండాలన్నారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి ,శ్రీనివాసరాజు, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్‌తో పాటు మూసీ రివర్ డెవెలప్మెంట్ కార్పొరేషన్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### ఫ్యూచర్ సిటీవరకు మెట్రో విస్తరణ..

సిటీ బ్యూరో, ఏప్రిల్ 11 (నమస్తేతెలంగాణ): హైదరాబాద్ మెట్రోను ఫ్యూచర్ సిటీ వరకు విస్తరించాలని ముఖ్యమంత్రి రెడ్డి నిర్ణయించారు. అందుకు అవసరమైన తుది ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో శుకవారం మెట్రో విస్తరణపై సీఎం సమీక్ష నిర్వహించారు. ఎయిర్ పోర్టు నుంచి ఫ్యూచర్ సిటీలోని యంగ్ ఇండియా స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ దాకా 40 కిలోమీటర్లు మెట్రోను విస్తరించేందుకు కొత్తగా ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. హైదరాబాద్ మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డీసీటీతో కాన్సర్‌కు చెక్

సరికొత్త విప్లవానికి నాంది పలికిన కిమ్స్ వైద్యులు



కిమ్స్ వైద్యులతో డాక్టర్ సాదత్ అలీ

సిటీబ్యూరో, ఏప్రిల్11, (నమస్తే తెలంగాణ): దేశంలో క్యాన్సర్ మహమ్మారి విస్తృతంగా వ్యాపిస్తోంది. 2022 సంవత్సరంలో దేశవ్యాప్తంగా కొత్తగా 14 లక్షలకు పైగా క్యాన్సర్ కేసులు నమోదుకాగా వారిలో దాదాపు 9 లక్షల మంది ఈ వ్యాధితో మరణించినట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కలు చెబుతున్నాయి. ఈ క్రమంలో క్యాన్సర్‌పై పోరాటంలో కిమ్స్ వైద్యులు సరికొత్త విప్లవానికి నాంది పలికారు. డెండ్రైటిక్ సెల్ థెరపీతో(డీసీటీ) కాన్సర్‌కు చెక్ పెట్టనున్నారు. శరీరంలోనే ఉండే డెండ్రైటిక్ సెల్ అనే కణాలను రక్తం నుంచి వేరు చేసి, వాటిని కాన్సంట్రేట్ చేసి తిరిగి ఎక్కించి చికిత్సనందిస్తుంటారు. ఇవి క్యాన్సర్ మీద పోరాడే టి–కణాలను ఉత్తేజితం చేస్తాయి, అలాగే మన శరీరంలో క్యాన్సర్ లేదా బ్యాక్టీరియాకు సంబంధించిన కణాలు అన్నింటినీ గుర్తించి మరీ నాశనం చేస్తాయి. మన దేశంలో ఈ తరహా చికిత్సను అందించే ల్యాబ్స్ అరుదు. దక్షిణాది రాష్ట్రాలన్నింటికీ కలిపి ఒక్క హైదరాబాద్‌లోనే ఈ ల్యాబ్ ఉండటం గమనార్హం. ప్రతి 2 వారాలకు ఒకసారి 3–4 డోసుల చొప్పున ఈ ఇంజెక్షన్లు ఇస్తారు. ఇదంతా ఒక విధమైన ఇమ్యునోథెరపీయే అయినా ఇప్పటి వరకు ఉన్నవాటికంటే చాలా భిన్నమైనదని స్టెమ్ సెల్స్ రీజనరేటివ్ అండ్ రీసెర్చ్ ల్యాబ్స్ సంస్థ ప్రతినిధి డా. సాదత్ అలీ తెలిపారు.

## ఎన్ఆర్ఎస్సీతో హైడ్రా ఒప్పందం

ప్రభుత్వ భూములు, చెరువుల సమాచారంపై పరస్పర సహకారం



ఎంఓయూను చూపిస్తున్న రంగనాథ్, డా.ప్రకాశ్‌చౌహాన్

సిటీబ్యూరో, ఏప్రిల్11(నమస్తే తెలంగాణ): ఓఆర్ఆర్ పరిధిలో ఉన్న భూముల వివరాలు అన్నీ అందుబాటులోకి తెస్తూ ఎక్కడ చెరువు ఉంది? ఆ చెరువు విస్తీర్ణం ఎంత? కాలువలు, నాలాల పరిస్థితి ఏంటనే సమాచారంతో పాటు ప్రభుత్వ భూములు, పార్కులకు సంబంధించి సరైన హద్దులతో సమాచారాన్ని సేకరించడానికి ఎన్ఆర్ఎస్సి( నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్)తో హైడ్రా శుక్రవారం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఎన్ఆర్ఎస్సి డైరెక్టర్ డా.ప్రకాశ్ చౌహాన్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ప్రభుత్వ, ప్రజావసరాలకు ఉద్దేశించిన భూముల వివరాలతో పాటు చెరువుల హద్దులు అందుబాటులో ఉంటే ఆక్రమణలకు ఆస్కారం లేకుండా ఉంటుందని ఈ ఇద్దరు అధికారులు అభిప్రాయపడ్డారు. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లకు సంబంధించి హద్దుల విషయంలో ఎలాంటి అపోహలకు ఆస్కారం లేకుండా సరైన సమాచారం అందించడం కోసమే ఈ ప్రయత్నం చేస్తున్నామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ చెప్పారు. ఈ ఒప్పందం మైలురాయిలాంటిదని, సర్వే ఆఫ్ ఇండియా 1970లో సర్వే చేసిన టోపోషీట్లు, కెడెస్ట్రియల్ మ్యాప్స్, రెవెన్యూ రికార్డులు, చెరువుల సమాచారంతో పాటు ఎన్ఆర్ఎస్సీశాటిలైట్ ఇమేజిలతో సమగ్ర సమాచారం అందుబాటులోకి తేవడమే హైడ్రా లక్ష్యమని రంగనాథ్ తెలిపారు. పర్యావరణాన్ని కాపాడుకుంటే హైదరాబాద్ దేశంలోనే గొప్పనగరంగా పేరొందుతుందని, హైరిజల్యూషన్ ఉపగ్రహ డేటా, వైమానిక ఫొటోగ్రఫీ, డిజిటల్ ఎలివేషన్ మోడల్స్ వంటివి ఎన్ఆర్ఎస్సి ద్వారా హైడ్రాకు అందుతాయని ప్రకాశ్ చౌహాన్ తెలిపారు. ఓఆర్ఆర్ వరకు ఉన్న ప్రాంతంతో పాటు జీహెచ్ఎంసీ చుట్టూ ఉన్న 27 మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో ఉన్న చెరువులు, ప్రభుత్వ భూముల సమగ్ర సమాచారాన్ని సేకరించి, విశ్లేషించి ప్రజలకు అందుబాటులోకి తేవడంలో హైడ్రా, ఎన్ఆర్ఎస్సిలు సంయుక్తంగా కృషి చేస్తాయని ఇరువురు అధికారులు తెలిపారు.

## అణగారిన వర్గాల ఆశాజ్యోతి పూలే

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి • ఘనంగా జ్యోతిబా పూలే జయంతి



పూలే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కలెక్టర్ అనుదీప్ తదితరులు

సిటీ బ్యూరో, ఏప్రిల్ 11 (నమస్తే తెలంగాణ): అణగారిన వర్గాల హక్కులు, మహిళోద్ధరణ, కుల వ్యవస్థ నిర్మూలన, సామాజిక సమానత్వం కోసం పోరాడిన మహనీయుడు మహాత్మా జ్యోతిబా పూలే అని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డాక్టర్ జీ ముకుంద రెడ్డి, డీఆర్ఓ ఈ వెంకటాచారి, ఆర్డీవో సాయిరాం, రెవెన్యూ, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### జలమండలి కార్యాలయంలో..

సిటీబ్యూరో, ఏప్రిల్11, (నమస్తే తెలంగాణ): కుల వివక్షను రూపుమాపడమే జ్యోతిరావు పూలేకు అసలైన నివాళి అని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఖైరతాబాద్ లోని ప్రధాన కార్యాలయంలో జలమండలి బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో జ్యోతి రావు పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఎన్సీ–2 డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్ కుమార్, ప్రాజెక్ట్ డైరెక్టర్ సుదర్శన్, ఆపరేషన్–1 డైరెక్టర్ అమరేందర్ రెడ్డి, జలమండలి బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ యూనియన్ల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పూలే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి, ఉద్యోగులు

### విద్యా విప్లవానికి మార్గదర్శి పూలే

మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

సిటీబ్యూరో, ఏప్రిల్ 11 (నమస్తే తెలంగాణ): మహాత్మా జ్యోతిరావు పూలే విద్యా విప్లవానికి మార్గదర్శిగా నిలిచారని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. క్రవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ ఇలంబర్తితో కలిసి మేయర్.. పూలే జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు వేణుగోపాల్, గీతా రాధిక, చీఫ్ ఇంజనీర్ రత్నాకర్, సీపీఆర్వో మహమ్మద్ ముర్తుజా అలీ ఇతర అధికారులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ ఇలంబర్తి

## టార్గెట్ @ రూ.3వేల కోట్లు

- బకాయిదారులకు నోటీసులు ఇచ్చి కలెక్షన్లు పెంచండి
- బల్దియా కమిషనర్ ఇలంబర్తి

సిటీబ్యూరో, ఏప్రిల్ 11 (నమస్తే తెలంగాణ): ఆస్తిపన్ను వసూళ్లలో గత ఆర్థిక సంవత్సరం జీహెచ్ఎంసీ అద్భుతమైన వసూళ్లను రాబట్టిందని, ఇదే స్ఫూర్తితో ఈ ఏడాది రూ.3వేల కోట్ల వరకు వసూళ్లను రాబట్టాలని జీహెచ్ఎంసీ కమిషనర్ అధికారులు, సిబ్బందికి దిశానిర్ధేశం చేశారు. శుక్రవారం నగరంలోని బంజారాభవన్‌లో రెవెన్యూ అధికారులు, బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, ఏఎంసీలు, డిప్యూటీ కమిషనర్లకు నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఆయన పాల్గొన్న కమిషనర్ వారికి ప్రశంసాపత్రాలు, మెమెంటోలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. బకాయిదారుల వెంటపడి నోటీసులు ఇచ్చి బకాయిలు వసూలు చేయాలన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ.2వేల కోట్లకు పైగా ఆస్తిపన్ను వసూలు చేయడంలో క్షేత్రస్థాయి అధికారులు బాగా పనిచేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు అనురాగ్ జయంతి, వేణుగోపాల్ రెడ్డి, రఘు ప్రసాద్, వేణుగోపాల్, సామ్రాట్ అశోక్, సరోజ, జోనల్ కమిషనర్లు హేమంత్ కేశవ్ పాటిల్, ఉపేందర్ రెడ్డి, రవికిరణ్, వెంకన్న, సీసీపీ శ్రీనివాస్, జాయింట్ కమిషనర్ మహేశ్ కులకర్ణి తదితరులు పాల్గొన్నారు.



## హనుమాన్ జయంతికి భారీ బందోబస్తు

రాచకొండ సీపీ సుధీర్ బాబు

సిటీబ్యూరో, ఏప్రిల్11,(నమస్తే తెలంగాణ): హనుమాన్ జయంతి ఉత్సవాల భద్రతా ఏర్పాట్లపై రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు శుక్రవారం పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కమిషనరేట్ పరిధిలో హనుమాన్ జయంతి ఉత్సవాల సమయంలో మత సామరస్యం కాపాడేలా, ఎటువంటి శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఊరేగింపుల్లో పాల్గొనే మహిళలు వేధింపులకు గురికాకుండా షి టీమ్స్ బృందాలు విధుల్లో ఉండాలన్నారు. ఈ సమావేశంలో డీసీపీ అడ్మిన్ ఇందిర, డీసీపీ స్పెషల్ బ్రాంచ్ నరసింహా రెడ్డి, అదనపు డీసీపీ అడ్మిన్ శివకుమార్, సీసీఆర్బి ఏసీపీ రమేష్, ఎస్బి ఏసీపీ రవీందర్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

### సీసీ కెమెరాల పాత్ర కీలకం

నేరాల నివారణలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని రాచకొండ సీపీ సుధీర్‌బాబు అన్నారు. మల్కాజిగిరి జోన్‌లో ఏర్పాటు చేసిన 1460 సీసీ కెమెరాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. సీపీ మాట్లాడుతూ.. మల్కాజిగిరి జోన్‌లోని 17 కాలనీల్లోని ప్రధాన రోడ్లు, జంక్షన్లను అనుసంధానిస్తూ రూ.1.19 కోట్లతో, రెండేండ్ల వార్షిక నిర్వహణతో 410 కెమెరాలను ఏర్పాటు చేయగా, 212 ఆలయాలను అనుసంధానిస్తూ మిగతా 1050 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని ఏర్పాటు చేసోతామని సీపీ తెలిపారు. సమావేశంలో మల్కాజిగిరి డీసీపీ పద్మజ, అదనపు డీసీపీ వెంకటరమణ, మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి, కుషాయిగూడ ఏసీపీ మహేశ్‌గౌడ్, ఐటీ సెల్ ఇన్‌స్పెక్టర్ నరేందర్‌గౌడ్ పాల్గొన్నారు.